క్లుప్తంగా

శేరేపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్



శేరేపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం అదే గ్రామంలోని లేవలేని రోగులు ఇంటికి వెళ్లి పరీక్షించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను కూడా పరీక్షించి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రవల్లిక, మదుసూదనరావు, ప్రభాకర్, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న దామోదర భజన మండలి సభ్యులు

నరసాపురం రూరల్: శ్రీ దామోదర భజన మండలి ఆధ్వర్యంలో భగవద్గీత పఠనాన్ని మదన గోపాలస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సుమారు పెద్ద ఎత్తున పాల్గొని గీతా పఠనం నిర్వహించారు. గీతావాచస్పతి తాడిమేటి కృష్ణవేణి నేతృత్వంలో గీతలోని 18 అధ్యాయాల పారాయణాన్ని వైభవంగా నిర్వహించారు.

ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్‌కు నరసాపురం లైబ్రేరియన్

నరసాపురం రూరల్: ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీస్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నరసాపురం గ్రేడ్–1 లైబ్రేరియన్ కేజేఎల్ఎస్ కుమారి హాజరయ్యారు. ఈమెతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు కూడా హాజరైనట్లు ఆమె బుధవారం విలేకరులకు తెలిపారు. న్యూఢిల్లీలో ఆగస్టు 5,6 తేదీల్లో జరిగిన ఈ కార్యక్రమం ప్రధానమంత్రి ఆలోచన అయిన వన్ నేషన్–వన్ లైబ్రరీలో భాగమన్నారు. రాజారామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ నిర్వహించిన ఈ ఫెస్టివల్ ఆఫ్ లైబ్రరీ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపతిముర్ము ప్రారంభించారని ఆమె పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో గొండి స్క్రిప్ట్, బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ, జోన్, లిటరరీ క్విజ్, బుక్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారని వివరించారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

వీరవాసరం: సార్వా సాగులో ఏ ఒక్క రైతుకు నీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈఈ కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మత్స్యపురి శివారు ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించారు. పంట కాలువ శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామన్నారు. ఎగువ ప్రాంతాల్లోని రైతులు పంట కాలవల నుండి వచ్చే నీటిని సద్వినియోగపరుచుకోవాలని, వృథాగా మురుగు డ్రైన్‌లోకి నీటిని వదలకూడదని సూచించారు. రైతు సమస్యల పట్ల తక్షణం స్పందిస్తామని చెప్పారు. మత్స్యపురి పంట కాలువ శివారు ప్రాంత రైతుల నుంచి నీటి ఎద్దడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈఈ బీవీ సత్యనారాయణ ఉన్నారు.

మొక్కను నాటు ప్రాణాన్ని కాపాడుకో...



చెరుకువాడలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ సాంబశివరావు

ఉండి: మొక్కలు నాటి ప్రాణాలను కాపాడుకుందామని పీఎంజేఎఫ్ లయన్స్ జిల్లా గాట్ మెంబర్‌షిప్ కో ఆర్డినేటర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెరుకువాడ జడ్పీ హైస్కూల్ ఆవరణలో క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వేలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సర్పంచ్ కొండవేటి సాంబశివరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం చిన్న పనిగానే కనిపించినా మొక్క ఎదిగి భావితరాలకు మంచి ఆరోగ్యం, భవిష్యత్తు అందిస్తుందని అన్నారు. మొక్కలు నాటడాన్ని తక్కువ చేసి చూడొద్దని ఆయన సూచించారు. హెచ్ఎం జీవీ కృష్ణంరాజు, దాట్ల కామరాజు, వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ, గాదిరాజు రంగరాజు పాల్గొన్నారు.

పేదలకు రక్ష–జగనన్న సురక్ష

- వేగంగా ధ్రువీకరణ పత్రాల మంజూరు
- ఇంటి వద్దకే తీసుకొచ్చి అందించిన వలంటీర్లు



ఇలపర్రులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు(ఫైల్)

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అండగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ప్రతీ ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన జగనన్న సురక్ష పేదలకు రక్షణగా నిలుస్తుంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జూలై 1న ప్రారంభమైన జగనన్న సురక్ష జూలై 24తో ఆచంట నియోజకవర్గంలో ముగిసింది. నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లోని 64 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్షను అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. జగనన్న సురక్షకు మహిళా లోకం నుంచి స్పందన అనూహ్యంగా రావడంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు 64 సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష ప్రతీ సమావేశంలోనూ పాల్గొని సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడమే కాకుండా, అందని వారికి సైతం అడ్డంకులు తొలగించడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసి కార్యక్రమ లక్ష్యాన్ని నెరవేర్చడానికి కృషి చేశారు.

52,583 మందికి ధ్రువీకరణ పత్రాలు

నియోజకవర్గంలో 52,583 మందికి 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆయా పథకాలకు కావలసిన ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అవస్థలు పడకుండా చేతికి అందడంతో ముఖ్యంగా మహిళలు సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 5805 మందికి, పెనుగొండ మండలంలో 14646 మందికి, పెనుమంట్ర మండలంలో 18440 మందికి, పోడూరు మండలంలో 13692 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

నిరీక్షణ లేకుండా...



ధ్రువీకరణ పత్రాలకు రోజుల తరబడి నిరీక్షణ లేకుండా, అధికారులే జగనన్న సురక్ష ద్వారా అందించారు. ప్రతీ ఏటా వీటికోసం ఇబ్బందులు పడేవాళ్లం. ముఖ్యంగా విద్యా సంవత్సరం ప్రారంభంలో మరీ ఇబ్బందిగా ఉండేది. ఇపుడా తిప్పలు తప్పాయి.

పూతినీడి నాగ దుర్గారావు, దొంగ గూడెం

కొత్తకార్డు ఇచ్చారు.



కొత్త రైస్ కార్డు మంజూరు చేసి జగనన్న సురక్షలో అందించారు. ఎలాంటి సిఫారసులూ లేకుండానే కొత్త కార్డును అందించారు. ప్రజల ఇబ్బందులను జగనన్న సురక్ష తో తొలగించారు.

టి.లక్ష్మి, పెనుగొండ

దేశాభిమానాన్ని పెంచుకోవాలి



మేడపాడులో నా భూమి- నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గంటా శాంతకుమారి

యలమంచిలి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ దేశాభిమాన్ని పెంచుకోవాలని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి కోరారు. మేడపాడు రైతు భరోసా కేంద్రం వద్ద నిర్మించిన నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్న మనమంతా స్వాతంత్ర్య సమర యోధులను జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, కార్యదర్శి ఎం.హరికుమార్ పాల్గొన్నారు.

శేరేపాలెంలో..

మొగల్తూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 20 వరకూ నా భూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు తెలిపారు. దీనిలో భాగంగానే బుధవారం మండంలోని అన్ని సచివాలయాలు, అమృత్ సరోవర్ చెరువుల వద్ద శిలాఫలకాలను ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు.

నివాళులర్పించడం అందరి బాధ్యత

పెనుగొండ: స్వాతంత్ర సమర యోధులను స్మరించుకొని నివాళులర్పించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. బుధవారం కొడమంచిలి సచివాలయం వద్ద శిలఫలకాలు ఏర్పాటు చేసి వీరుల పేర్లు నమోదుతో పాటు, నాభూమి- నాదేశం, నేలతల్లికి నమస్కారం వీరులకు వందనం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కే శ్రీనివాస్, రైతు సంఘ నాయకులు మన్నే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి వనమరాజు, చామంతి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

ఆచంటలో

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆచంట సచివాలయం వద్ద వీరులకు వందనం శిలాఫలకం వద్ద ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నివాళుర్పించి, ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్నాథం, ఎంఈవో రాజేంద్ర, కార్యదర్శి జీవీఎల్ నరసింహరావు పాల్గొన్నారు. పెనుమంచిలిలో సర్పంచ్ గణేషుల శేషవేణి సుబ్బారావు ఆధ్వర్యంలో శిలాఫలకం ఆవిష్కరించారు.

పెనుగొండలో

పెనుగొండ పంచాయతీ వద్ద సర్పంచ్ నక్కా శ్యామాల సోనీ ఆధ్వర్యంలో నాభూమి– నాదేశం, నేలతల్లికి – నమస్కారం వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి డీఎం మహంతి, ఈఓపీఆర్డీ డీసీహెచ్ వీఎస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా బుధవారం నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం ఆజాదీ కా అమృత్ మహోత్సవాల శిలాఫలకాలను వివిధ గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌లు ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. పెనుమంట్రలో సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, నత్తారామేశ్వరంలో సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, నెగ్గిపూడిలో సర్పంచ్ మామిడిశెట్టి ధనలక్ష్మి తదితరులు ఆధ్వర్యంలో శిలాఫలకాలను ఆవిష్కరించారు.



శేరేపాలెం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బాబ్జిరాజు



పెనుగొండలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ



కొడమంచిలి సచివాలయం వద్ద నిర్వహిస్తున్న సభలో నాయకులు, విద్యార్థులు



పెనుమంట్రలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తాడపర్తి ప్రియాంక

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

పెనుమంట్ర: దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మారుమూల ప్రాంతాల్లో మగ్గిపోతున్న ఆదివాసులను దేశాభివృద్ధిలో భాగస్వాములు చేయాలని ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి ప్రసాద్ అన్నారు. జిల్లా అధ్యక్షులు కుంతాడ పెద సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం పెనుమంట్ర మార్కెట్‌యార్డులో ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయిన తరుణంలో ఆదివాసీలను కూడా భారత దేశ ప్రథమ పౌరురాలిగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఎంపిక కావడం హర్షనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త వెంకటేశ్వరరావు, బండి రాంబాబు, సాలా వెంకటేశ్వరరావు, పాలకుర్తి పెద్దిరాజు, మానుపాటి మసేను,గాడా లవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌విఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో అద్దేపల్లి గంగరాజు సత్రం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో అద్దేపల్లి గంగరాజు సత్రం చైర్మన్ అద్దేపల్లి మోహన్‌దాస్ సౌజన్యంతో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వంతో పాటు దాతల సహకారం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు బి. త్రిమూర్తులు, బొక్కా భవానీదుర్గ, శశికళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ పుష్కరిణి అభివృద్ధికి విరాళం

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త మేడేపల్లి మల్లికార్జునరావు, పావని దంపతుల కుమారుడు మౌనిష్ చౌదరి రూ.5లక్షలు విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీ దేవి దాతల కుటుంబ సభ్యులకు బాబా ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రతిమతో సత్కరించారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉండి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి జీవీ మల్లికార్జునరావు సూచించారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటరు నమోదు కార్యక్రమంపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్‌లు ఎస్వీఎస్ నాయుడు, టీపీ కృష్ణారావు, ఎస్.విజయలక్ష్మి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



జిన్నూరుపాలెం జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పోడూరు: జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. జిన్నూరు శివారు జిన్నూరుపాలెం జగనన్న కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన 42 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, వీధిలైట్లను, 8 నివాసాల్లో విద్యుత్ మీటర్లను బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్‌లైన్లు, తాగునీరు వంటి సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామన్నారు. కాలనీల్లో ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతీఒక్కరికీ పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. మహిళల రక్షణకోసం చట్టాలను, సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మహిళలంతా ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కడలి పద్మావతి, ఉప సర్పంచ్ దండు వెంకట గోపాలకృష్ణంరాజు, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము బుజ్జి, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు, కార్యదర్శి మీసాల నర్సింహులు, చెల్లబోయిన సత్యనారాయణ, జుత్తుగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సాయం

పోడూరు: జిన్నూరుపాలెం గ్రామానికి చెందిన కుక్కల వంశీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న వంశీ ఇటీవలే ఇంటికి వచ్చాడు. ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ బుధవారం వారి నివాసానికి వెళ్లి వంశీని పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్ వెంట వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కడలి పద్మావతి తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



మహిళకు బియ్యం కార్డు అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రభుత్వం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు రెండవ విడతగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుండీ అపూర్వ స్పందన వస్తుంది. బుధవారం నరసాపురం పట్టణంలోని 27వ వార్డులో 3వ రోజు కార్యక్రమానికి ఉదయం 6 గంటల నుంచే ఆయన శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా నూతనంగా మంజూరైన ఇంటి స్థలం దస్తావేజులు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. రూ.54 లక్షల నిధులతో చేపట్టిన పలు సీసీ రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణాలను ఆయన శంకుస్థాపనలు చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు అక్కడికక్కడే పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతీ లబ్ధిదారుడిగా నేరుగా తమ ఇంటి వద్దకే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందన్నారు. గ్రామ సచివాలయం అనే గొప్ప వ్యవస్థను తీసుకు వచ్చి ప్రభుత్వ పాలన సులభతరం చేసి పేద ప్రజలకు సంక్షేమ ఫలాలను తమ ఇంటి వద్దకే అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను స్వాగతిస్తున్నారని, వార్డులలో పర్యటిస్తున్నప్పుడు ప్రజల నుంచిప్రభుత్వం పట్ల వస్తున్న విశేష స్పందనకు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ గోరు రమాదేవి, సత్తిబాబు, బర్రి శంకర్, చిట్టూరి కృష్ణ, కావలి నాని, డీఈఈ ఆర్ రమేష్‌బాబు, ఏఈఈ లు మణి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో ఓపెన్ స్కూల్ కేంద్రం



చెరుకువాడ జెడ్పీ పాఠశాలలో ఓపెన్ స్కూల్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ–చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ స్కూల్ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఏపీఓఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈ.నారాయణ తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఓపెన్ స్కూల్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్లో తరగతి చేరేందుకు ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండాలన్నారు. చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డుషీట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు జతచేయాలన్నారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, ఒడియా భాషలను ఎంపిక చేసుకోవచ్చునన్నారు. ఓపెన్ స్కూల్ ప్రతి ఆదివారం ప్రతీ నెలా రెండవ శనివారంల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తామన్నారు. అభ్యాసకులు ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉందన్నారు. పెనుగొండ మండలంలో ఓపెన్ స్కూల్‌లో చేరే వారు మండల కో ఆర్డినేటర్ 94917 19783, 94411 48626 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికార్లు శుభాకరరావు, శ్రీరామకృష్ణులు, హెచ్ఎం భరణీకుమార్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారంపై దృష్టి పెట్టాలి



లంకలకోడేరులో గర్భిణులకు అదనపు పోషకాహారం అందిస్తున్న దృశ్యం



యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద భోజనాలు చేస్తున్న గర్భిణులు

పాలకొల్లు అర్బన్: గర్భిణులు అదనపు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు బుధవారం పరీక్షలు నిర్వహించి పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, సూపర్‌వైజర్ డి.కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాలు

యలమంచిలి: ప్రతి నెల 9న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇలా పరీక్షలకు వచ్చే గర్భిణులకు పరీక్షలు ఆలస్యమైనా ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాతా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేయమని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలిచ్చారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 35 మంది గర్భిణులకు, మేడపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 మందికి, దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది మందికి పరీక్షలు నిర్వహించి భోజనాలు ఏర్పాటు చేశారు. యలమంచిలి, మేడపాడు, దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు స్వరూప్, భారతి, చంద్రరేఖలు గర్భిణులను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహ్మద్ హసీనా, ఎం.మల్లీశ్వరి, గంధం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ అమలుకు కొత్తగా తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఐసీడీఎస్ అడిషనల్ పీడీ విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వైట్ల ఉషారాణి, డి.మార్తమ్మ, విజయలక్ష్మి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

భీమవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమవరం రూరల్ పరిధిలోని కొవ్వాడ పుంత గ్రామానికి చెందిన షేక్ కరీబ్ ఉన్నీ సేస్‌కు దుర్గాపురంలోని అబ్దుల్ రహీబ్‌తో వివాహమైంది. ఇటీవల కొంతకాలంగా అబ్దుల్ రహీబ్ తన భార్య కరీబ్ ఉన్నీ సేస్‌ను అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.